

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం

రెంటచింతల: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయానికి ఆదివారం భక్తులు తరలి వచ్చారు. విచారణ గురువు బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజలో పాల్గొన్నారు.

రాజ శ్యామలాదేవిగా బండ్లమ్మ



చందోలు (పిట్లలవానిపాలెం): మాఘమాసం రెండో రోజు చందోలులోని బగళాముఖి బండ్లమ్మను ఆదివారం రాజ శ్యామలాదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ వర్సిటీ దూరవిద్య డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 15 వరకు అవకాశం ఉన్నట్లు జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్రం ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ రెగ్యులర్, దూరవిద్యతోపాటు డిప్లొమా, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరేందుకు సైతం ఈనెల 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఎంఏలో ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ, హిందీతోపాటు ఎమ్మెస్సీలో మ్యాథ్స్, సైకాలజీ సబ్జెక్టులు ఉన్నాయని, పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రంతో పాటు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు పల్నాడులో విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. 2022-23 సంవత్సరంలో అవార్డులకు ఎంపికైన 126 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. అవార్డులకు ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన ఒక్కొక్క విద్యార్థి బ్యాంక్ ఖాతాలలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం రూ.10వేలు జమ చేసిందని తెలిపారు. సదరు విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, గైడ్ టీచర్లకు సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్ 9032871234ను సంప్రదించాలని తెలిపారు.

సహకార సేవా కేంద్రం ప్రారంభం



బాపట్ల అర్బన్: రైతులకు అతి తక్కువ వడ్డీతో రుణాలిచ్చి వారి ఆర్థికాభివృద్ధికి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అండగా నిలుస్తోందని బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు అన్నారు. బాపట్లలోని నందిరాజుతోటలో ఆదివారం బ్యాంక్ సేవా కేంద్రం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక సహకార రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. ఇప్పటికే వివిధ సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలిచ్చామని, వీటితో వారి జీవన ప్రమాణాలు పెంచుకున్నారని చెప్పారు. నందిరాజుతోటలో సేవా కేంద్రం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలక వర్గ డైరెక్టర్లు, బ్యాంక్ సీఈవో, జీఎంలు, డీజీఎంలు, ఏజీఎంలు, బ్యాంకు సిబ్బంది, పీఏసీఎస్ సంఘ ప్రెసిడెంట్లు, సీఈవోలు హాజరయ్యారు. తొలుత సేవా కేంద్రానికి జీఎంగా వీవీఎస్ ఫణికుమార్ బాధ్యతలు చేపట్టారు.

శ్రీ పంచమి నాడు పంపిణీకి ఆరు వేల పెన్నుల వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గుంటూరు కృష్ణనగర్ బృందావన్ కాలనీకి చెందిన పద్మనాభుని జయరాం దేవస్థానానికి 6 వేల పెన్నులను విరాళంగా అందజేశారు. దాత ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణలకు అందజేశారు. 14వ తేదీ శ్రీపంచమిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులకు ఈ పెన్నులను పంపిణీ చేయాలని దాత కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 517.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 819.40 అడుగుల వద్ద ఉంది.

భయం వద్దు.. అప్రమత్తంగా ఉండండి!

- ట్యాంకర్లతో నీటి సరఫరాపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి
- మంచినీటి వినియోగంపై అవగాహన కల్పించండి
- ఇంటింటి సర్వేలో అన్ని వివరాలు నమోదు చేయండి
- కంట్రోల్ రూం సమర్థంగా పనిచేయాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశం
- డయేరియా అనుమానిత కేసులపై అధికారులతో సమీక్ష

అనారోగ్య సమస్యలకు కారణాలపై అన్వేషణ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని. వేదికపై కలెక్టర్, కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో పలువురు అస్వస్థతకు గురైన పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సూచించారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ గుంటూరు జీజీహెచ్‌లో పలు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో మంత్రి ఆదివారం కలెక్టర్‌తో పాటు, ఆయా విభాగాల ముఖ్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్య సమస్యలకు కారణాలపై అన్వేషణ కొనసాగుతోందని, ఇప్పటికే ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించామని తెలిపారు. అన్ని వివరాల్ని సూక్ష్మస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సమర్థంగా పనిచేయాలని చెప్పారు. అస్వస్థత కేసులు నమోదవుతున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి అందజేస్తున్న విషయంపై స్థానికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటింటి సర్వే పకడ్బందీగా జరగాలని, ఎక్కడా నిర్లక్ష్యంగా ఉండొద్దని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు. ఎక్కడైనా సమస్యలుంటే 83413 96104 నంబర్‌కు ఫోన్ చేయాలని, 24 గంటలూ అందుబాటులో ఉంటుందని ప్రజలకు సూచించారు. హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేయడం ద్వారా వైద్యంతో పాటు సహాయసహకారాలు అందుతాయని వెల్లడించారు. అనుమానిత ప్రాంతాల్లో మంచినీటి శాంపిళ్లను తీసుకున్నామని, వాటిని పరీక్షలకు పంపామని తెలిపారు. నగరంలో ఒకేచోట నుంచి ఈ కేసులు రావడం లేదని చెప్పారు. ఉదయం నుంచి పరిస్థితి అదుపులోనే ఉందని, కొత్తకేసులు నమోదుకావడం లేదన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో అన్ని చర్యలు చేపడుతున్నామని, బాధితులకు అత్యున్నత వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని అన్ని యూపీహెచ్‌సీల్లో 24 గంటలపాటు మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. సోమవారం కూడా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలెక్టరేట్‌లో మరోసారి రివ్యూ నిర్వహిస్తామని తెలిపారు. పరిస్థితి పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చేవరకు అత్యవసరస్థితి కొనసాగుతుందని వెల్లడించారు. సమావేశంలో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, ఆర్డీ శోభారాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్ర తాగునీటిని అందించేందుకు చర్యలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాపై ప్రజలు ఆందోళనకు గురికావద్దని, పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆమె ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచి శ్రీనగర్, శారదా కాలని, వసంతరాయపురం, ఐపీడీ కాలని, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మెడికల్ కాలేజీలోని రీజినల్ ల్యాబ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి సరఫరా సమయంలో ఇళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సరఫరాపై ప్రజలు ఆందోళనకు గురికావద్దని, శుద్ధమైన నీటిని అందించేందుకు నగరపాలక సంస్థ పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నీటిలో క్లోరిన్ శాతం తగిన మోతాదులోనే ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. నగరంలో తాగునీటి సమస్యలపై యుద్ధప్రాతిపదికన స్పందించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 0863-2345103 స్పెషల్ కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నీటి కాలుష్య అనుమానిత ప్రాంతాలైన శ్రీనగర్, శారదా కాలని, సంగడిగుంట ప్రాంతాలకు ముగ్గురు డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, డి.వెంకటలక్ష్మిని ప్రత్యేక అధికారులుగా నియమించామని తెలిపారు.

ప్రత్యేక సిబ్బంది నియామకం

ఉండవల్లి నుంచి తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ వరకు పైప్‌లైన్ పరిశీలనకు ఈఈ కొండారెడ్డి, హెడ్ వాటర్ వర్క్స్, సంగంజాగర్లమూడి వాటర్ వర్క్స్‌లో క్లోరినేషన్, ఫిల్టరేషన్, ల్యాబ్‌లో పరీక్షలను డీఈఈ హనీఫ్‌కు, హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తాగునీటి సరఫరాపై ఈఈ శ్రీనివాస్, ఏఈ బాబర్‌లను నియమించినట్లు కమిషనర్ తెలిపారు. శారదా కాలనీ, శ్రీనగర్, సంగడిగుంట ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్ల పరిశీలన, క్లోరినేషన్, లీకుల మరమ్మతులకు ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు రమేష్ బాబు, మహ్మద్ రఫిక్, రాము, ఏఈలు అనూష, శ్రీకాంత్‌లకు ప్రత్యేక విధులు కేటాయించామని వివరించారు. ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు అనుమతి లేకుండా సెలవు పెట్టరాదని కమిషనర్ స్పష్టం చేశారు.

జీజీహెచ్ నుంచి 14 మంది డిశ్చార్జి



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న వారిలో 14 మంది ఆరోగ్యం కుదుటపడటంతో ఆదివారం వారిని ఇంటికి పంపించామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. బాధితులకు చికిత్స అందించేందుకు ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోస్ట్ ఆపరేటివ్ వార్డును ఆయన పరిశీలించారు. ప్రతి రోగిని పలకరిస్తూ, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎప్పటికప్పుడు బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేస్తూ నీరస పడకుండా మేరకు కోడిగుడ్లు, రొట్టెలను అందించినట్లు చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల్లో అధిక రక్తపోటు, షుగర్‌తో పాటు ఆందోళన ఎక్కువగా ఉందని కనిపిస్తుండటంతో సంబంధిత సంబంధిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగులు రెండు మూడు రోజుల్లో కోలుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని పాల్గొన్నారు.

కార్యదర్శులతో శాంపిల్స్ సేకరణ

ఆదివారం ఉదయం నగరంలోని బీఆర్ స్టేడియం, శారదా కాలని, ఐపీడీ కాలని, నల్ల చెరువు తదితర రిజర్వాయర్ల పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో 53 మంది ఎమినిటీ కార్యదర్శులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 537 శాంపిల్స్ సేకరణ చేశారని, వాటిలో క్లోరిన్ తగు మోతాదులోనే ఉందని గుర్తించినట్లు కమిషనర్ తెలిపారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు మరో రెండు రోజులు పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉండాలని ఆదేశించారు. అనంతరం శారదా కాలని పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వివరాలను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. నగర ప్రజలు కూడా తాగునీటిని కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ మధుసూదన్, డీఈఈలు రమేష్ బాబు, హనీఫ్, రాము, శ్రీధర్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆయుబ్ ఖాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



శారదా కాలనీలో తాగునీటి శాంపిల్స్ పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

కొండవీడుకు మహర్దశ

- ఇక్కడి అభివృద్ధిలో భాగస్వామిని కావడం నా అదృష్టం
- ప్రతి ఒక్కరూ కొండవీడు చరిత్ర తెలుసుకోవాలి
- సీఎం వైఎస్ జగన్ చొరవతో మరింత అభివృద్ధి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- రూ.5 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న రెండో దశ ఘాట్ రోడ్డు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కొండవీడుకు మహర్దశను తీసుకొచ్చామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గిరిదుర్గం స్వాగత ద్వారం నుంచి గెస్టుహౌస్ వరకు కొండపై రూ.5 కోట్ల నిధులతో నిర్మించిన రెండో దశ ఘాట్ రోడ్డు శిలాఫలకాన్ని మంత్రి రజిని ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఆమెకు కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. మంత్రి రజిని మాట్లాడుతూ కొండవీడు కోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సర్వత్రా కృషి చేస్తుందన్నారు. గొప్ప వారసత్వ సంపదను భావితరాలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగా కొండవీడు ఉత్సవాలను ఎంతో వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కొండవీడు నేడు గొప్ప పర్యాటక ప్రాంతంగా వర్ధిల్లేందుకు ఆద్యుడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, 2005లో కొండపై ఘాట్‌రోడ్డు నిమిత్తం ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.5 కోట్ల నిధులను ముఖ్యమంత్రి హోదాలో విడుదల చేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండవీడు కోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. కొండవీడు-నగరవనం పేరిట ఏటా కోట్ల రూపాయల నిధులను అందించి దశలవారీగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులను నిర్వహించారని మంత్రి వివరించారు.



హెలీకాప్టర్‌లో మంత్రి విడదల రజిని

2019 తర్వాతే అభివృద్ధి

కొండవీడు అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముందు ఆ తరువాత అనే విధంగా మారిందని విడదల రజిని చెప్పారు. 2019 ముందు ఎంతో చరిత్ర గలిగిన ఈ ప్రాంతం గురించి పట్టించుకున్న నాథుడు లేడని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కొండవీడుకు కొత్త రూపు తీసుకొచ్చారని, ఈ బృహత్తర కార్యాన్ని స్థానిక ఎమ్మెల్యేగా తన చేతుల మీదుగా జరగడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎందరో సాహితి, కళాకారులను అందించిన ఈ ప్రాంతం చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కొండవీడు పర్యాటక కేంద్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నగరవనం కింద రూ.15 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఎంతో చరిత్ర కలిగిన పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలకు జీవం పోసినట్లు అవుతుందని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందని చెప్పడానికి కొండవీడు కోట అభివృద్ధి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడు తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కొత్తపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎంవీ సుబ్బారావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, కొండవీడు కోట అభివృద్ధి కన్వీనర్ కల్లి శివారెడ్డి, ఆర్డీఓ సరోజిని, తహసీల్దార్ మోహమ్మద్ అఫ్రపున్నిసా బేగం, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నాట సుబ్బారావు పాల్గొన్నారు.

సజావుగా సీనియర్ ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లా వ్యాప్తంగా 94 కేంద్రాల్లో హాజరైన విద్యార్థులు
- విస్తృత తనిఖీలు నిర్వహించిన అధికారులు
- సీసీ కెమెరాలతో ఆర్‌ఐవో కార్యాలయం, బోర్డు నుంచి ప్రత్యక్ష వీక్షణ



గుంటూరులోని ఓ కళాశాలలో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

గుంటూరుఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) ఆదివారం ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 94 కేంద్రాల్లో విద్యార్థులు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా హాజరయ్యారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అవే కళాశాలల్లోని ల్యాబ్‌లలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన ప్రాక్టికల్స్ కేంద్రాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరించారు. ప్రైవేటు కళాశాలలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి సీనియర్ అధ్యాపకులను సీఎస్‌లుగా నియమించారు. ప్రాక్టికల్స్ నిర్వహణ, మార్కుల నమోదులో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇంటర్మీడియెట్ బోర్డు నేరుగా నియమించిన ఎగ్జామినర్లు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 24,910 మంది సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సుల విద్యార్థులకు ఈనెల 20వ తేదీ వరకు విడతల వారీగా ప్రాక్టికల్స్ జరగనున్నాయి. వీరిలో 21,817 మంది ఎంపీసీ, 3,093 బైపీసీ విద్యార్థులున్నారు.

విజయవంతంగా ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు

ప్రాక్టికల్స్ చేసిన విద్యార్థుల ఆన్సర్ షీట్లకు ఆయా కళాశాలల వారీగా స్పాట్‌లోనే వాల్యూయేషన్ చేయడంతోపాటు విద్యార్థుల మార్కుల్ని అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానం విజయవంతమైంది. గతేడాది వరకు ఓఎంఆర్, బార్ కోడింగ్ పద్ధతిలో మాన్యువల్‌గా నిర్వహించిన మార్కుల నమోదు విధానాన్ని ప్రస్తుత ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోకి మార్పులు చేసిన ప్రభుత్వం, తొలిసారిగా అమలు చేసింది. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థులకు సంబంధించిన ఆన్సర్ షీట్లను స్పాట్‌లోనే వాల్యూయేషన్ చేసిన ఎగ్జామినర్లు మార్కులను ఇంటర్మీడియెట్ బోర్డు సైట్‌లో నమోదు చేశారు. ప్రాక్టికల్స్ కేంద్రాల్లో ఆర్‌ఐవో జీకే జుబేర్‌తోపాటు డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరును ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా గుంటూరులోని ఆర్‌ఐవో కార్యాలయంతో పాటు విజయవాడలోని ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. కేంద్రాల్లో విద్యార్థులతోపాటు సీఎస్, ఎగ్జామినర్లు, ఇతర సిబ్బంది కదలికల్ని నేరుగా పర్యవేక్షించారు.



కార్యాలయంలో ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా తిలకిస్తున్న ఆర్‌ఐవో జుబేర్

ప్రాక్టికల్స్‌కు హాజరైన 7,911 మంది

ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన ప్రాక్టికల్స్‌కు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 94 కేంద్రాల పరిధిలో 7,911 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో సీనియర్ ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌కు కేటాయించిన 7,408 మంది విద్యార్థుల్లో 7,263, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు కేటాయించిన 757 మందికి 648 మంది చొప్పున హాజరయ్యారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- ఆరంభమైన మాఘమాస సందడి
- సర్వ దర్శనానికి రెండున్నర గంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు విశేషంగా తరలివచ్చారు. మాఘమాసం ప్రారంభం కావడంతో శుభకార్యాలు, నిశ్చయ తాంబూలాలకు హాజరయ్యేందుకు నగరానికి విచ్చేసిన వారు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో రద్దీ కనిపించింది. మరో వైపున తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేయడం కనిపించింది. తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల వాహనాలతో ఘాట్‌రోడ్డు ఉదయం 9 గంటలకే కిటకిటలాడింది. సీతమ్మ వారి పాదాలు, హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర పార్కింగ్ చేసుకుని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ. 300, రూ.500 టికెటు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. మరో వైపున మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయగా, రద్దీ మరింత పెరిగింది. సర్వ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు రమేష్‌బాబు, చంద్రశేఖర్ క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ నూతన కమిటీ ఎన్నిక విజయవాడ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ని సెమినార్ హాలులో ఆదివారం జరిగింది. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్పీ శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.శేషగిరిరావు, కార్యదర్శిగా వై.భార్గవ్, జాయింట్ సెక్రటరీగా కేఎస్ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారిగా కె.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.రఘునాథరెడ్డి, బి.దేవుడు ఎన్నికయ్యారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ తెలిపారు.

క్లుప్తంగా

సీఎం సభాస్థలి, గ్యాలరీల నిర్మాణ పనుల పరిశీలన



ఫిరంగిపురం: మండల కేంద్రంలో ఈనెల 15న నిర్వహించనున్న 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. కాగా సభాస్థలి, గ్యాలరీల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ మండలి సభ్యుడు తలశిల రఘురామ్, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎస్పీ తుషార్ దూడీలు ఆదివారం పరిశీలించారు. హెలీప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు, బ్యారీకేడ్లు ప్రదేశాలలో చేపట్టాల్సిన పనులపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి, ఆర్డీవో పి.శేఖర్, ఆర్‌అండ్‌బీ అధికారులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎంపిక



తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ స్పెషల్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం మంగళగిరి ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి రాష్ట్రంలోనే గుంటూరు జిల్లాను ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుమ్మడి కోటేశ్వరరావు చేసిన సేవలు మరువలేనిదని అన్నారు. అనంతరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఆర్.ఎస్. వంశీకృష్ణ, అధ్యక్షులుగా కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా యస్.కె. సంధాని, ట్రెజరర్‌గా గుమ్మడి వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, సౌత్ జోన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ దినేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో ప్రజాసేవ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ
- పెదకాకానిలో 1,114 మందికి వైద్య పరీక్షలు
- 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం' వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులు, స్థానిక పెద్దలతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న యువ ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే దిక్సూచి అని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటిరోజు ఆదివారం బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమం జరిగింది. ఈ సంగమం ద్వారా నేత్రజ్యోతి కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలను 1,114 మంది వినియోగించుకున్నారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి వీరిలో 15 మందికి యాంజియోగ్రామ్ సూచించారు. వారిని మంగళవారం విజయవాడకు ప్రత్యేక వాహనం ద్వారా తీసుకు వెళ్లి వైద్యసేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. గత నాలుగున్నర సంవత్సరాల నుంచి సీఎం జగన్ పాలనలో స్వర్ణయుగం నడుస్తుందన్నారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు, తారు రోడ్లు కాదని ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడమేనన్నారు. విద్య, వైద్యం పుష్కలంగా అందించాలన్నారు. మన బడి, నాడు-నేడు, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన వంటి పథకాలను పార్టీలకు అతీతంగా అందజేస్తూ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న నిజమైన ప్రజాయోధుడు వైఎస్ జగన్ అన్నారు. జగనన్న సంక్షేమ పాలనలో పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలను చేరవేస్తూ ఒక పవిత్రమైన కార్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో దీనినే ఆదర్శంగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ద్వారా అంకితభావంతో ప్రజా సేవను కొనసాగిస్తున్నామన్నారు. గత సంవత్సర కాలంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ద్వారా కంటి సమస్యల నివారణకై నేత్రజ్యోతి ద్వారా ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్ళద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలానే మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయించడం జరిగిందన్నారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జైపూర్ కాళ్ళు, వెస్టన్ కమోడ్‌లు అందజేయడం జరిగిందని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, చేబ్రోలు జెడ్పీటీసీ సభ్యురాలు బత్తుల అనురాధ, పెదకాకాని సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మాతంగి నిర్మల, నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, కుక్కల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనసాగనున్న జగన్నామ సంక్షేమ శిబిరం

పెదకాకాని గ్రామంలో ఆదివారం జరిగిన జగన్నామ సంక్షేమ సంగమ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో అందరికీ వైద్య సేవలు అందించాలనే ఆశయంతో ఈ వైద్య శిబిరాన్ని సోమవారం కూడా కొనసాగిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమాలకు చేయూత అవసరం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందరెడ్డి

పర్చూరు (చినగంజాం): ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధాశ్రమాలకు చేయూతనందించడం ఎంతైనా అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్, కో-ఆపరేటివ్ సొసైటీ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. నూతలపాడు గ్రామంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. నేటి సామాజిక స్థితిగతులు, మారుతున్న కుటుంబ వ్యవస్థ వల్ల సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోందన్నారు. ఇది వాంఛనీయం కాకపోయినా తప్పని పరిస్థితుల్లో స్వాగతించాల్సి వస్తోందన్నారు. ఎంతో మంది వృద్ధులకు నీడనిస్తున్న వృద్ధాశ్రమాలకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. అమెరికాకు చెందిన సహృదయ ఫౌండేషన్ ప్రతినిధి తాడివాక బిందు ఆశ్రమానికి రూ.20 వేలు విలువ కలిగిన నిత్యావసరాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు, రోటరీ సభ్యులు భవనం రాజగోపాలరెడ్డి, మాజీ సర్పంచ్ పి.శివారెడ్డి, టీటీడీ కల్యాణ మండప నిర్మాణ కమిటీ సభ్యులు పంబి వెంకటరెడ్డి, మనుబోతు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అఖిల్‌రాజ్ (ఫైల్)

బొల్లాపల్లి: బైక్‌ని ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం అక్కపాలేనికి చెందిన బండెల పేతురు, మరియమ్మ రెండో కుమారుడు అఖిల్‌రాజ్(17) వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలీ పనుల నిమిత్తం కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు ప్రాంతానికి వెళ్లారు. రెండు రోజులు సెలవులు కావడంతో అఖిల్‌రాజ్ నాయనమ్మ, తాతయ్యల స్వగ్రామమైన మండలంలోని గంగుపల్లికి వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతిచెందాడు. సమాచారం మేరకు బండ్లమోటు ఎస్‌ఐ డి.చెన్నకేశవులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి అన్న అలేఖ్యబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పల్నాడు జిల్లా ప్రజలకు అందుబాటులో సేవా కేంద్రం


జీడీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి



నరసరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకును దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపినట్లు బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) అన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆవరణలో ఆదివారం ఆయన పల్నాడు జిల్లా సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సేవా కేంద్రంలో జీఎంతో పాటు ముగ్గురు ఏజీఎంలు, చీఫ్ మేనేజర్‌లు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. సేవా కేంద్రం ప్రారంభంతో ఇక నుంచి పల్నాడు జిల్లా ప్రజలు సొసైటీల చైర్‌పర్సన్‌లు, సీఈఓలు బ్యాంకు అధికారులు గుంటూరు ఏడీఎం ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదని చెప్పారు. బ్యాంకు అధికారులు, సొసైటీల సిబ్బంది, చైర్ పర్సన్‌ల సమష్టి కృషితోనే బ్యాంకును రూ.6 వేల కోట్ల టర్నోవర్‌కు చేర్చినట్లు వెల్లడించారు. 2.59 లక్షల సమైఖ్య ఖాతాలను మూడు నెలల వ్యవధిలో ప్రారంభించి దేశంలోనే బ్యాంకు మొదటి స్థానంలో ఉందన్నారు. రూ.600 కోట్ల మేర స్వయం సహాయ గ్రూప్‌లకు రుణాలు అందించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బ్యాంకర్స్ సమావేశంలో సహకార బ్యాంకులు మా వ్యాపారాలు అడ్డు వస్తున్నాయని జాతీయ బ్యాంకుల వారు మాట్లాడితే సహకార బ్యాంకులు మా బ్యాంకులని ముఖ్యమంత్రి మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం మన రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి సొసైటీలను కంప్యూటరీకరణ చేస్తుందన్నారు. బ్యాంకు పురోభివృద్ధిలో సమైఖ్య ఖాతాలను ప్రారంభించటంలో ముందున్న వారందరికీ త్వరలో ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు. సమావేశానికి బ్యాంకు డైరెక్టర్ కోటా హరిబాబు అధ్యక్షత వహించారు. బ్యాంకు సీఈఓ టి.కృష్ణవేణి, డైరెక్టర్లు వట్టికొండ కోటేశ్వరమ్మ ఆంజనేయులు, వెలిశిల ఏడుకొండలు, మూడావత్ గోవిందానాయక్, ప్రొఫెషినల్ డైరెక్టర్ కె.శివ నవీన్, జీఎంలు చింతల అజేయ్ కిషోర్ కుమార్, వి.వి.ఎస్. ఫణి కుమార్, కె.మాధవి, డీజీఎం కె.శ్రీనివాస్, ఏజీఎంలు బత్తుల బాలకృష్ణారెడ్డి, బి.సుబ్బారావు, బాలాజీ నాయక్, చీఫ్ మేనేజర్‌లు ఎస్.రమాదేవి, మందాల కోటిరెడ్డి, కిషోర్, రఫి, ప్యాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పొలిమేర వెంకటరెడ్డి, మేనేజర్లు మిరియాల కోటేశ్వరరావు, ప్రభాకర్, శివారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏఎంలు ఎస్. వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా



యడ్లపాడు: మనిషి విడగొట్టే మతాలు ముఖ్యంకాదు.. డీఎన్ఏలను ప్రకారంగా గమనిస్తే మానవులంతా ఒకటేనని శాస్త్రీయంగా నిర్ధారణ అవుతుందని నెల్లూరు ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా సాహెబ్ పేర్కొన్నారు. చెకుముకి 34వ సైన్స్ సంబరాలు యడ్లపాడు నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం నిర్వహించారు. హూ ఐయాం ఐ అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. రాష్ట్రస్థాయి క్విజ్ తదితర పోటీల్లో 48 విద్యార్థి బృందాలు పాల్గొన్నాయి. ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ సంబరాల్లో విజ్ఞాన యాత్రల్లో భాగంగా కొండవీడు ఫెస్ట్-2024 ఉత్సవాలకు ఐదు బస్సుల్లో తీసుకువెళ్లారు. చారిత్రక ప్రాంతం విశిష్టత, నాటి రాజులు పాలనా వైభవంపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించి, వసంతరాజీయం వేదిక్పై అభ్యుదయ గీతాలు, నృత్యాలు, రూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడుజిల్లా అధ్యక్షులు డాక్టర్ దార్ల బుజ్జిబాబు, కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్ చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు సీహెచ్ సృజన, ఎం.వెంకటేశ్వరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జేవీవీ ఆల్‌ఇండియా సైన్స్ పీపుల్స్ నెట్‌వర్క్ సభ్యులు కె.శ్రీనివాస్, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకర్రావు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల్లో మెరుగైన పన్ను వసూళ్లు

- టార్గెట్ రూ.119.95 కోట్లు..
- జనవరి చివరి నాటికి రూ.103.85 కోట్లు వసూలు
- మార్కెటింగ్‌శాఖ ఏడీ బి.రాజబాబు

కొరిటెపాడు(గుంటూరు): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాలో మార్కెట్ కమిటీల పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో 8 మార్కెట్ కమిటీలకు 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.119.95 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా.. అందులో అత్యధికంగా గుంటూరు మార్కెట్ యార్డుకు రూ.93 కోట్లు, పొన్నూరుకు రూ.6.92 కోట్లు, తెనాలికి రూ.6.20 కోట్లు, అత్యల్పంగా ఫిరంగిపురానికి రూ.1.80 కోట్లు ఇచ్చామన్నారు. మిగిలిన వాటిలో ప్రత్తిపాడుకు రూ.3.40 కోట్లు, మంగళగిరికి రూ.3.30 కోట్లు, దుగ్గిరాలకు రూ.3.23 కోట్లు, తాడికొండకు రూ.2.10 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్దేశన చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో జనవరి చివరి నాటికిగానూ రూ.86.57 శాతం పురోగతితో రూ.103.85 కోట్లు వసూలైందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి రూ.94.90 కోట్లు వసూలు కాగా ఈసారి రూ.8.95 కోట్లు పెరిందన్నారు. ఈ లెక్కన ఈ ఏడాది వంద శాతానికి మించి వసూళ్లు జరిగేలా విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేశామని తెలిపారు. మొత్తం మీద చూస్తే.. ప్రస్తుతం పన్ను వసూళ్లలో గుంటూరు మార్కెట్ యార్డు ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాత పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడు, మంగళగిరి, దుగ్గిరాల కమిటీలు నిలిచాయన్నారు. తాడికొండ, ఫిరంగిపురం కమిటీలు చాలా వెనుకబడినట్లు పేర్కొన్నారు.

వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

నెహ్రూ నగర్: వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి నూతన కార్యవర్గం ఎన్నికను సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల వెంకట్ అధ్యక్షతన ఆదివారం అరండల్‌పేటలో నిర్వహించారు. సమితి రాష్ట్ర సెక్రటరీగా దేవళ్ల భాస్కర్ రావు, రాష్ట్ర సలహాదారు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడుగా బండారు వెంకటరావు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడుగా వల్లెపు బాల కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడుగా బూర్సు శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడుగా ఉప్పుతల సత్యనారాయణ, నగర యూత్ అధ్యక్షుడుగా అచ్చి చైతన్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు వడ్డెరల అభివృద్ధికై పాటుపడుతూ, వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సూచించారు.

రైతు బాంధవుడు స్వామినాథన్ సేవలు అజరామరం

ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదజయలక్ష్మీదేవి



గుంటూరు రూరల్: ఊపిరి ఉన్నంత వరకు వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి దేశాన్ని ఆహార సంక్షోభం నుంచి స్వయం సమృద్ధి సాధించే దిశగా నడిపించిన హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది మన్ననలు పొందిన భారతదేశ హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్ర నిపుణుడు ఆయనని చెప్పారు. ఆయన చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఆయన మరణానంతరం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని ఇచ్చి సత్కరించటం సంతోషకరమన్నారు. ఆయన వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి చేసిన సేవలను అభివర్ణించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు అధిపతిగా, కేంద్ర వ్యవసాయ ప్రధాన కార్యదర్శిగా, రైతుల ఆత్మహత్యల కోసం ఏర్పడిన జాతీయ కమిషన్ చైర్మన్ లాంటి ఎన్నో పదవులలో పనిచేశారన్నారు. పద్మశ్రీ,, రామన్ మెగాసేసే, పద్మభూషణ్, పద్మ విభూషణ్, వరల్డ్ ఫుడ్ ప్రైజ్, ఇందిరాగాంధీ శాంతి బహుమతి, ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం లాంటి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను ఆయన అందుకున్నారన్నారు.

మరుపురాని జ్ఞాపకాలతో..మళ్లీ బాల్యంలోకి..



1980-81 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): ఒకప్పటి బాల్య స్నేహితులు నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. షష్టి పూర్తి చేసుకునే తరుణం ఆసన్నమవుతున్న సమయంలో అందరూ బాలలుగా మారిపోయారు. ఆనందోత్సాహాలతో, కరచాలనాలు, కౌగిలింతలతో చిన్నప్పటి అనుభవాలను పంచుకున్నారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. 1980-81లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 40 మంది తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. పాఠశాలలో తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. సైన్సు ఉపాధ్యాయుడు



తరగ(తి)ని జ్ఞాపకాల గదిలో విద్యార్థులై..

ఎస్.నాగేశ్వరరావు, పీవీ సుబ్బారావు, మరో ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి మాస్టారు చనిపోవడంతో ఆయన కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి రాఘవరెడ్డిని ఘనంగా సత్కరించారు. అందరూ సహపంక్తి భోజనం చేసి, సరదాగా ముచ్చట్లు చెప్పుకున్నారు.

అన్నదాత ఆదర్శవాది



సభలో మాట్లాడుతున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి

- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి
- వ్యవసాయ కళాశాలలో పూర్వవిద్యార్థుల భవనం ప్రారంభం

బాపట్ల అర్బన్: అన్నం పెట్టే రైతు ఆదర్శవాది అని, ఇవ్వడంలోని విలువను ప్రతి ఒక్కరూ రైతు నుంచే తెలుసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో 'ఆలమ్ని అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ ఫర్ కాలేజ్ డెవలప్‌మెంట్' ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలమ్ని హౌస్‌ను ఆదివారం వీసీ ప్రారంభించారు. అనంతరం బీవీ నాథ్ ఆడిటోరియంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజన్నారు. పూర్వ విద్యార్థులు ఆలమ్ని హౌస్ నిర్మాణానికి విరాళాలిచ్చి.. కళాశాల రుణం తీర్చుకోవడం హర్షణీయమన్నారు. కేవలం పది నెలల్లో ఇంత విశాలమైన నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రారంభించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని వీసీ కొనియాడారు. భవనాన్ని సకల సౌకర్యాలతో నిర్మించిన ఆలమ్ని హౌస్ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ విశ్వ విద్యాలయం 2వేల చ.మీ. స్థలాన్ని భావన నిర్మాణానికి కేటాయించిందని తెలిపారు. 2023లో నాటి ఉప కులపతి ఆచార్య డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. జాతీయ స్థాయి సమావేశాలు, సెమినార్లు, వర్క్‌షాపులు, శిక్షణ తరగతులకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ నిర్మాణంలో ఏజీహెచ్‌సీ క్లబ్ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. విరాళమిచ్చిన పూర్వ విద్యార్థులు, ఆచార్యులను ఘనంగా సత్కరించారు. అలాగే వ్యవసాయ సాంకేతిక సమాచార కేంద్రం భవనం శంకుస్థాపన కార్యక్రమాన్ని దాతలు వి.హరిప్రసాద్ దంపతులు నిర్వహించారు. ఏఏజీటీసీడీ ఎగ్జిక్యూటివ్ కమిటీ కోశాధికారి డాక్టర్ వి.సీతారాంబాబు ట్రస్ట్ ఆదాయ వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కమిటీ కన్వీనర్ డ్టార్ టి.వెంకట శ్రీధర్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి.కరుణాసాగర్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, కమిటీ సభ్యులు డాక్టర్ కె.సుశీల, డాక్టర్ వి. జ్యోతి, శ్రీమతి కె.హేమ, డాక్టర్ ఎం.రవి బాబు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.